

క్రికెట్ ఆడి క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్పీ గౌష్‌ఆలం

## క్రీడలతో మానసికోల్లాసం

**ములుగు ఎస్పీ గౌష్‌ఆలం**

ములుగురూరల్, జూన్ 19 : క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహద పడుతాయని ములుగు ఎస్పీ గౌష్‌ఆలం అన్నారు. సోమవారం మండలంలోని జాకారం పీటీసీ ఆవరణలో పోలీస్ అధికారులకు డివిజన్ల వారీగా ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొని క్రికెట్ ఆడి క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అటలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. విధి నిర్వహణలో ఒత్తిళ్లు ఎదుర్కొనేందుకు అధికారులకు క్రీడలు ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ సంకీర్త్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగజ్యోతి

## జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా

ములుగు, జూన్19 (నమస్తే తెలంగాణ) : జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ అకాల మరణం కారణంగా సోమవారం జరగాల్సిన స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా పడ్డాయి. ముందుగా సభ్యులు జగదీశ్వర్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ గురువు లాంటి జగదీశ్వర్ మరణం తీరని లోటన్నారు. ప్రతి క్షణం ప్రజల కోసం పరితపించే ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. జగదీశ్ అడుగు జాడల్లో నడుస్తూ ములుగు జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామన్నారు. జడ్పీటీసీలు సకినాల భవాని, రుద్రమదేవి, హరిబాబు, రమణ, కరమ్‌చంద్, పుష్పలత, జడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌గా నాగజ్యోతి

***పీఆర్ చట్టం ప్రకారం నియమిస్తున్నట్లు జడ్పీ సీఈవో వెల్లడి***

ములుగు జిల్లా పరిషత్ చైర్మన్‌గా నాలుగు సంవత్సరాల పాటు కొనసాగిన కుసుమ జగదీశ్వర్ ఈ నెల 11న గుండెపోటుతో మృతిచెందగా ఆయన స్థానంలో వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న బడే నాగజ్యోతికి జడ్పీ చైర్‌పర్సన్‌గా పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నియమిస్తున్నట్లు జడ్పీ సీఈవో ప్రసూనారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్ చట్టం 2018లోని సెక్షన్ 189(3) ప్రకారం నియమించినట్లు ఆమె పేర్కొన్నారు.

## ఆకుపచ్చని తెలంగాణ

# కేసీఆర్ ఘనతే..

- స్వరాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెరిగింది
- ప్రజలు బాధ్యతగా మొక్కలు పెంచాలి
- మంత్రి సత్యవతి రాథోడ్
- హరితయజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- అటవీ శాఖ ఆధ్వర్యంలో హరితోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, చిత్రంలో మంత్రి సత్యవతి రాథోడ్, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, కలెక్టర్ భవేశ్‌మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణను ఆకుపచ్చగా మార్చేందుకే సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని తీసుకొచ్చారని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్ ఎదుట రూ.36.5 లక్షలతో నిర్మించిన ఆక్యూపంక్చర్ పార్కును మంత్రి ప్రారంభించి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం కలెక్టరేట్ పనుల పురోగతిని ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకొని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆచార్య జయశంకర్ అర్బన్ ఎకో పార్కులో హరితోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి హాజరై మొక్కలు నాటి, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రీన్ కవర్ పెంచేందుకు 2015లో తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనేది గతంలో ఒక నినాదంగానే ఉండేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆచరణలోకి తెచ్చారన్నారు. ప్రజలందరూ మొక్కలను బాధ్యతగా నాటి పెంచేలా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 241 పల్లె ప్రకృతి వనాలు, రెండు అర్బన్ ఫారెస్టు పార్కులు ఏర్పాటు చేసి మియావాకీ పద్ధతి ద్వారా మొక్కలు నాటి పెంచినట్లు చెప్పారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా రిపోర్టు ప్రకారం 2015 నుంచి 2021 మధ్య రాష్ట్రంలో ఫారెస్ట్ కవర్ 6.85 శాతం పెరిగిందని, గ్లోబల్ సిటీగా ఉన్న హైదరాబాద్ నేడు గ్రీన్ సిటీగా రూపొందిందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు గడప గడపకూ చేరుతున్నాయన్నారు. పచ్చగా ఉన్న రోడ్లన్నీ తెలంగాణవని, పచ్చదనం లేని రోడ్లన్నీ ఇతర రాష్ట్రాలవని తెలిపారు. చైనా, బ్రెజిల్ తర్వాత పచ్చదనంలో మూడో స్థానంలో తెలంగాణ రాష్ట్రం నిలిచిందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి స్మగ్లింగ్ చేసి తీసుకొస్తున్న కలపను ఇక్కడి అటవీ అధికారులు సాంకేతికతతో పట్టుకుంటున్నారని కొనియాడారు. అడవుల అభివృద్ధికి ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. సీఎం కేసీఆర్‌కు భూపాలపల్లి నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానం ఉందని, కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయం, మెడికల్ కాలేజీ త్వరలోనే పూర్తవుతాయని, ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రాబోతున్నారన్నారు. త్వరలో 3వేల పైచీలుకు పోడుదారులకు 8 వేల ఎకరాల్లో పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పట్టాలు ఇచ్చిన తర్వాత అడవుల జోలికి ఎవ్వరూ వెళ్లొద్దని, ఈ దిశగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. పోడు పట్టాదారులకు రైతుబంధు ఇస్తామని, వ్యవసాయానికి అనుగుణంగా లేని పోడు భూములను గిరివికాసం పథకం కింద అభివృద్ధి చేసుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు మహిళల పేరుపై ఇస్తామని, నియోజకవర్గంలో 1,100 మందికి దళిత బంధు ఇవ్వనున్నట్లు చెప్పారు.

### మొక్కలు నాటి సంరక్షించుదాం

*– ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి*

బాధ్యతతో మొక్కలు నాటి సంరక్షించుకుందామని, హరితహార యజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. నీళ్లు, చెట్లు ఎక్కడ ఉంటాయో అక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీని ఏర్పాటు చేసుకొని బ్లాక్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, అటవీ పునరుద్ధరణ వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని, దీని ఫలితంగా ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా అనే కేంద్ర సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్ కవర్ గణనీయంగా పెరిగిందన్నారు. సమైక్య రాష్ట్రంలోజిల్లాలో పులి జాడలు కనపడకపోయేవని, నేడు వన్యప్రాణుల సంఖ్య పెరిగి, అనువైన వాతావరణం ఏర్పడడంతో పెద్ద పులులు జిల్లా అడవుల్లోకి వస్తున్నాయనారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎకో టూరిజానికి అనువైనదని, ఆ దిశగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ భవేశ్‌మిశ్రా మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా పచ్చని చెట్లు ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నట్లని, ఇతర రాష్ట్రాలకు చెందిన ట్రక్కు డ్రైవర్లు చెప్తున్నారని అన్నారు. ఇదంతా తొమ్మిదేండ్లలో సాధించిన ఘనత అన్నారు. వేడుకల్లో వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ సురేందర్‌రెడ్డి, డీఎఫ్‌వో లావణ్య, నాబార్డ్ వరంగల్ రీజియన్ సీజీఎం సుశీల చింతల, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభా రఘుపతిరావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు హింగె మహేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బీ రమేశ్‌గౌడ్, డీఆర్‌డీవో పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బేతి శ్రీనివాస్‌రెడ్డి, మినిస్టీరియల్ సెంట్రల్ ఫోరం జోనల్ అధ్యక్షుడు ఉస్మాన్‌బేగ్, బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పాల్గొన్నారు. అంతకు ముందు వేడుకల్లో నాబార్డ్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఉత్తమ అటవీ శాఖ ఉద్యోగులను సన్మానించి మెమోంటోలను అందజేశారు. వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

# మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**70 లక్షల ఎకరాల్లో ములుగు అటవీ ప్రాంతం: ములుగు కలెక్టర్ కృష్ణఆదిత్య**

ములుగురూరల్, జూన్ 19 : మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత మన అందరిపై ఉందని ములుగు కలెక్టర్ ఎస్ కృష్ణఆదిత్య అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం ములుగు మండలం జాకారం అటవీ బ్లాక్‌లో డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ హరితోత్సవ వేడుక కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ గౌష్ ఆలం, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులతో కలిసి 10 వేల మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొమ్మిదేండ్లుగా జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించేందుకు ప్రభుత్వం అవతరణ దశాబ్ది ఉత్సవాలు పండుగలా నిర్వహిస్తున్నదన్నారు. అందులో భాగంగా హరితోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ కవర్ పెంచేందుకు 2015లో తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో 76 శాతం అటవీ ప్రాంతం ఉందని, ఇందులో 70లక్షలు ఎకరాల విస్తీర్ణం ఉన్న ప్రాంతం ములుగు అన్నారు. కలెక్టర్ల రివ్యూ మీటింగ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం మొక్కల రక్షణపై మొదటగా ప్రస్తావిస్తారని తెలిపారు. హరితహారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అటవీ సిబ్బంది 103.43 లక్షల మొక్కలు నాటి వాటి పెరుగుదలకు కృషి చేసినట్లు తెలిపారు.



జాకారంలో మొక్క నాటుతున్న కలెక్టర్ కృష్ణఆదిత్య, చిత్రంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్

ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు. తొమ్మిదో విడుత హరితహారంలో జిల్లా వ్యాప్తంగా 14.50 లక్షల మొక్కలు నాటాల్సి ఉందని, ఇందులో అందులో 50 శాతం అటవీశాఖ అధికారుల బాధ్యతే అని అన్నారు. ఎస్పీ గౌష్‌ఆలం మాట్లాడుతూ భావి తరాలకు మేలు చేసే కార్యక్రమం హరితహారం అన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన అటవీ ప్రాంతం ములుగు జిల్లాలో ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ మన పిల్లలను ఎలా చూసుకుంటామో మొక్కలను కూడా అలానే చూసుకోవాలన్నారు. మొక్కలు గొప్పతనం వర్ణించలేనిదని, పూర్వ కాలంలో మొక్కలు మానవుడికి మెడిసిన్‌లా పనిచేసేదన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కల పెంపకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులకు అండగా ఉండి అటవీ సంపదను రక్షించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. తొమ్మిదేండ్ల కాలంలో పల్లెలన్నీ పచ్చదనంతో నిండాయని, ఇది కేవలం సీఎం ఆలోచనకు నిదర్శనం అన్నారు. అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. హరితోత్సవ వేడుకలో భాగంగా ములుగు శ్మశాన వాటికలో కలెక్టర్ మొక్కను నాటారు. అలాగే దేవగిరిపట్నం మైనార్టీ పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ సంకీర్త్, ఎఫ్‌డీవో జోగేందర్, ఎఫ్ఆర్వో శంకర్, మాధవీశీతల్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.